క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ పోటీలకు మొగిలిచర్ల విద్యార్థినులు



రీతిక



నందిని

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ మొగిలిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన జన్ను నందిని, ముల్క రీతికలు ఈ నెల 15(నేటి) నుంచి హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం అనిత, పీఈటీ బీమగాని ముఖర్జీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న వరంగల్ నగరంలోని సుందరయ్యనగర్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



నర్సంపేట: నర్సంపేట మండలం దాసరిపల్లి గ్రామానికి చెందిన యువకులు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి సుదర్శన్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు కర్ణాకర్, భిక్షపతి, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక వాహనాలు సీజ్

చెన్నారావుపేట: అనుమతులు లేకుండా ఇసుక విక్రయిస్తున్న ఇసుక వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం మాట్లాడుతూ కల్లెడ శివారులోని ఆకేరు వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న పర్వతగిరికి చెందిన రెండు ట్రాక్టర్లను పట్టుకుని తహసీల్దార్‌కు అప్పగించామని, అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్థిక సాయం

గీసుకొండ: మండలంలోని ఊకల్‌హవేలిలో దివ్యాంగుడు లక్క నర్సింగం ఇప్పటికే ఓ కాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈక్రమంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో రెండో కాలు విరిగి మంచానికే పరిమితమయ్యాడు. దీంతో 'ఉబుంటు' సేవా సంస్థ వారు రూ.5వేల సాయం చేయగా శనివారం ఆ మొత్తాన్ని సర్పంచ్ మొగసాని నాగదేవతసంపత్, సంస్థ ప్రతినిధి కర్ణకంటి రాంమూర్తి, కొత్తగట్టు కోటేశ్వర్, శిరీష, బాబూరావు, మండల శ్రీను బాధిత కుటుంబ సభ్యులకు అందించారు.

17న ఓంకార్ వర్ధంతి సభ



గీసుకొండ: మచ్చాపూర్‌లోని ఓంకార్ స్మారక స్థూపం వద్ద ఆయన వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 17న 'మనువాదం–రాజ్యాంగం' అనే అంశంపై సభను నిర్వహిస్తున్నట్లు ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి తెలిపారు. శనివారం సభకు సంబంధించిన కరపత్రాలను స్థూపం వద్ద విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు కంకనాల మల్లికార్జున్, కందికొండ కుమారస్వామి, బండి బుచ్చయ్య, ఆది నారాయణ , గూడ సాయిరాం, రాజు, సురేశ్, చారి, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



ద్యాగల రాజేష్



గన్నారపు అఖిల్

నల్లబెల్లి: భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) యూత్ మండల అధ్యక్షుడిగా శనిగరం గ్రామానికి చెందిన ద్యాగల రాజేష్(కృష్ణ)ను నియమించినట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ ఊడుగుల ప్రవీణ్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షులుగా అనుశెట్టి వినోద్, కొలిపాక రంజిత్, ప్రధాన కార్యదర్శిగా గన్నారపు అఖిల్, సహాయ కార్యదర్శులుగా మల్యాల ప్రశాంత్, అల్లాపురపు అనిల్, ప్రచార కార్యదర్శిగా ఊరటి సాయిరాజ్, కార్యవర్గ సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా ద్యాగల రాజేష్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. తమ నియామకానికి కృషి చేసి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, ఎంపీపీ ఊడుగుల సునిత, వైస్ ఎంపీపీ గందె శ్రీలతకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంగిలిపూల వేడుక

- ఘనంగా తొలిరోజు బతుకమ్మ
- ఉత్సాహంగా పాల్గొన్న యువతులు, మహిళలు



నల్లబెల్లి: బతుకమ్మతో చిన్నారి

జిల్లా వ్యాప్తంగా శనివారం తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను యువతులు, మహిళలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఉదయమే నిష్ఠతో వివిధ రకాల పూలతో పేర్చిన బతుకమ్మలను మహిళలు ఆయా గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో ఉంచి పాటలు పాడారు. కోలాటాలతో ఆనందంగా గడిపిన అనంతరం సమీపంలోని చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. వాయినాలు, ప్రసాదాలను ఇచ్చిపుచ్చుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖానాపురంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



సంగెం: గవిచర్లలో..



సంగెం : రామచంద్రాపురంలో..



చెన్నారావుపేటలో బతుకమ్మలతో మహిళలు



చెన్నారావుపేట హనుమాన్ గుడి ఆవరణలో..



నెక్కొండ: బతుకమ్మలతో మహిళలు



నల్లబెల్లి: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



రాయపర్తి : కాట్రపల్లిలో..



సంగెం : బతుకమ్మతో ఎమ్మెల్యే సతీమణి జ్యోతి



వర్ధన్నపేటలో..



పర్వతగిరిలో..



నెక్కొండ : బతుకమ్మ ఆడుతున్న మహిళలు



దుగ్గొండి: బతుకమ్మ వేడుకలో మహిళలు



రాయపర్తి: వెంకటేశ్వరపల్లిలో..

బాధిత కుటుంబానికి మంత్రి పరామర్శ



సుభాష్‌తండాలో నివాళులర్పిస్తున్న మంత్రి దయాకర్‌రావు

రాయపర్తి: మండలంలోని శివరామపురం బీఆర్ఎస్ గ్రామపార్టీ అధ్యక్షుడు భూక్యా జగన్ తండ్రి చత్రు ఇటీవల మృతిచెందగా రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. చత్రునాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మంత్రి వెంట జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, సర్పంచ్ చెదుపాక కుమారస్వామి, అనిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉందాటి సతీష్, తాళ్లపెల్లి సంతోష్‌గౌడ్ ఉన్నారు.

నర్సంపేట: పట్టణానికి చెందిన మద్దికాయల రాంబాబు సతీమణి మద్దికాయల రేణుక శనివారం ఆకస్మికంగా మృతి చెందగా బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నివాళులర్పించారు. అలాగే కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్, జాటోతు సంతోష్, కొంపెల్లి రాజేందర్, రామాంజనేయులు, శ్రీరామోజు మురళి, ఎండీ.బాబా, అఖిల్, మర్రి రాజు పాల్గొన్నారు.

కనుల పండువగా శారద హరిద్రాదర్శనం



రామన్నపేట: వరంగల్‌లోని శృంగేరి శంకర మఠంలో శారద శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రధాన అర్చకుడు సంగమేశ్వర జోషి ఆధ్వర్యంలో అర్చకులు చంద్రశేఖర్ శర్మ, రామకృష్ణ శర్మ, సోమశేఖర శర్మ, వివేక్ జోషి, విశాల్ జోషి, సాయి శర్మ పంచసూక్తులతో సకల నదీజలాలతో మహాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులు సమర్పించిన పసుపుతో అమ్మవారిని హరిద్రాలంకరణ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఎమ్మెల్యే నరేందర్, ఎమ్మెల్సీ సారయ్య, తదితరులు దర్శించుకున్నారు.

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి సాధ్యం

- మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



పార్టీలో చేరిన వారితో దొంతి మాధవ రెడ్డి

నల్లబెల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని బోల్లోనిపల్లి, అర్షనపల్లి గ్రామాలకు చెందిన రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పాలుదాసరి రమేష్, బిక్కనూరి మౌనిక సుమన్, గాజర్ల అనూష అశోక్‌లతోపాటు పలువురు మాధవ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. ఈ సందర్భంగా మాధవ రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న ఆరు గ్యారంటీ స్కీంలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో చిట్యాల తిరుపతి రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలు తుంగలో తొక్కారు

వర్ధన్నపేట: గత ఎన్నికల ముందు బీఆర్ఎస్ అనేక హామీలు ఇచ్చి వాటిని తుంగలో తొక్కిందని, కాంగ్రెస్ పార్టీ హామీ ఇస్తే మాట నిలబెట్టుకుని అమలు చేస్తుందని కాంగ్రెస్ నాయకులు ఎద్దు సత్యనారాయణ, పోశాల వెంకన్న అన్నారు. శనివారం మండలంలోని ఇల్లంద గ్రామంలో కాంగ్రెస్ రూపొందించిన ఆరు గ్యారెంటీ పథకాల కరపత్రాలతో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం అవినీతితో కూరుకుపోయిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం సమ్మయ్య, మైదం బుచ్చిమల్లు, తాటికాయల రాములు, మైదం బాబు, బాస్కర్, లచ్చమ్మ, మంజుల, సుగుణ, ఎలేంద్ర, సువర్ణ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఖానాపురం: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు సూచించారు. ఈ మేరకు మండలంలోని కీర్యతండాలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు వల్లె శ్రీనివాస్, సారంగపాణి, రవి, మోహన్, ఈర్య, స్వామి, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

పర్వతగిరి: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించే ఏడో జోనల్ స్థాయి క్రీడా పోటీలు రెండో రోజు శనివారం కొనసాగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 14, 17, 19సంవత్సరాల లోపు బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల, హ్యాండ్‌బాల్, టెన్నికాయిట్, చెస్, క్యారమ్స్, ఆర్చరీ, హాకీ, బాక్సింగ్, రెజ్లింగ్, బాల్ బ్యాడ్మింటన్, రగ్బీ, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ఈ పోటీల్లో వరంగల్, కరీంనగర్, జయశంకర్‌భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల నుంచి 550మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మిషన్లు అందుకున్న మహిళలతో షాయిద్ మసూద్

న్యూశాయంపేట: కుట్టుశిక్షణ ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించి కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలవాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ షాయిద్ మసూద్ అన్నారు. హనుమకొండ ములుగురోడ్డులోని ముస్లిం కమ్యూనిటీ సెంటర్‌లో మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టుశిక్షణ కేంద్రంలో 4వ బ్యాచ్‌లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లు శనివారం అందజేశారు. ఫోరం కన్వీనర్ డాక్టర్ అనీస్‌సిద్దిఖీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేయూ ప్రొఫెసర్ ముస్తఫా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో ఫోరం ప్రతినిధులు ఎం.ఏ.కలీం, నస్రీన్ వాహిదీ, సయ్యద్ అక్బర్, నదీం బేగ్, మాషూఖ్ రబ్బానీ, అజీం, నుశ్రత్, కనీజుల్ వరా తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగి ప్రవళికది ప్రభుత్వ హత్యే..



దుగ్గొండి: మర్రి లింగయ్యను పరామర్శిస్తున్న బీజేపీ నేత రేవూరి ప్రకాష్‌రెడ్డి



నెక్కొండ: సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నెక్కొండ: పోటీ పరీక్షల రద్దు.. వాయిదాలతో నిరుద్యోగ యువతకు ఆత్మహత్యలే శరణ్యమయ్యానని, గ్రూప్–2, డీఎస్సీ అభ్యర్థి ప్రవల్లిక బలవన్మరణం ప్రభుత్వ హత్యేనని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల హరీశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బక్కి అశోక్ ఆరోపించారు. నిరుద్యోగ యువత ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని నిరసిస్తూ.. మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో శనివారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్లక్ష్యంతో అభ్యర్థులు ఆందోళనలకు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, కిష్టయ్య, కుసుమ చెన్నకేశవులు, ఈదునూరి సాయికృష్ణ, ప్రశాంత్, దిలీప్, శ్రావణ్‌కుమార్, శరత్, శివాజి, దినేష్, కార్తీక్, విక్కీ, దయాకర్ పాల్గొన్నారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

నల్లబెల్లి: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితోనే మర్రి ప్రవళిక ఆత్మహత్య చేసుకుందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతి రెడ్డి మాట్లాడారు. ప్రవళిక ఆత్మహత్య ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని మండిపడ్డారు. ప్రవళిక ఆత్మహత్య నేపథ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపి సంతాపం ప్రకటించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు కాంగ్రెస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండించారు. కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, వైనాల అశోక్, శేఖర్ గౌడ్, కొమురారెడ్డి, చరణ్ సింగ్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

పరీక్షల వాయిదాతో యువత అయోమయం

దుగ్గొండి: బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరి, టీఎస్‌పీఎస్సీ పనితీరుతో పరీక్షలు వాయిదాలు పడుతుండటంతో యువత అయోమయానికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని బిక్కాజిపల్లిలో ప్రవళిక కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి, మాట్లాడారు. తన నియోజకవర్గంలో ప్రజలు ఆపదలో ఉంటే పరామర్శించడానికి సైతం పోలీసులు అనుమతించకపోవడం బాధాకరన్నారు. ఆయన వెంట సంతోష్ నాయక్, చుక్క రమేష్, ప్రభాకర్, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

టీఎస్‌పీఎస్సీని వెంటనే రద్దు చేయాలి

వర్ధన్నపేట: నిరుద్యోగి ప్రవళిక ఆత్మహత్య ప్రభుత్వ హత్యేనని, ఇందుకు కారణమైన టీఎస్ పీఎస్సీని రద్దు చేయాలని అఖిల పక్ష నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వర్ధన్నపేట పట్టణంలోని వరంగల్– ఖమ్మం జాతీయ రహదారి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈ రాస్తారోకోతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రహదారికి ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను బలవంతంగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగం రాదేమోనని ప్రవళిక ఆత్మహత్య చేసుకుందని ఆమె ఆత్మహత్య ప్రభుత్వ హత్యేనన్నారు. ప్రవళిక కుటుంబానికి రూ.10లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. టీఎస్ పీఎస్సీ బోర్డును రద్దు చేసి కొత్త చైర్మన్‌ను నియమించాలని కోరారు. నాయకులు ఎలిషాల రాజేష్, నరుకుడు వెంకటయ్య, రవి, జక్కి శ్రీకాంత్, బచ్చల స్వామి, జన్ను నర్సయ్య, గుజ్జ రవీందర్‌రెడ్డి, మల్లెపాక సమ్మయ్య, కొంగ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం

చెన్నారావుపేట: నిరుద్యోగ యువతతో బీఆర్ఎస్ ప్రభుత్వం చెలగాటమాడుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్‌నాయక్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా దుగ్గొండి మండలం బిక్కాజిపల్లి గ్రామానికి చెందిన మర్రి ప్రవళిక మరణం ముమ్మాటికి ప్రభుత్వ హత్యే అన్నారు. ఆమె కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. నోటిఫికేషన్ల రద్దు.. పేపర్ లీకేజీల పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీని తరిమికొట్టాలన్నారు. సమావేశంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు తాళ్లపెల్లి నర్సయ్యగౌడ్, జిల్లా కార్యదర్శి మొగిళి వెంకట్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు సిద్దన రమేష్, మండల ప్రధాన కార్యదర్శి మంచాల సదయ్య, రమేష్ యాదవ్, ఇంద్రసేనారెడ్డి, అమిరోద్దిన్, సర్పంచ్ తూటి పావని, రమేష్, బండి హరీశ్, రాజేందర్, సారయ్య, తదితరులు ఉన్నారు.

దసరా ఉత్సవాలకు సహకరించండి



వినతిపత్రం అందజేస్తున్న ఉత్సవ కమిటీ

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గ చిన్నవడ్డేపల్లి చెరువు ప్రాంగణంలో జరగనున్న బతుకమ్మ, రావణ వధ, దసరా ఉత్సవాలకు సహకరించాలని కాశిబుగ్గ దసరా ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు దూపం సంపత్ మాట్లాడుతూ ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు.